

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త బేబీ మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి



మండలంలోని రాజవొమ్మంగి బీసీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న చీడి బేబీ (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. బేబీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ శనివారం ఇంటి వద్ద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీనియర్ అంగన్వాడీ వర్కర్ అయిన బేబీ గతంలో అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై జరిగిన పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. బేబీ మృతదేహాన్ని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కె.వెంకటలక్ష్మి, మండల అధ్యక్షురాలు సిహెచ్.కుమారి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి నిర్మల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, సిఐటియు మండల నాయకులు బేబీ మృతికి తీవ్ర సంతాపం తెలియజేశారు.

గిరి రైతులకు జిసిసి అన్యాయం చేస్తే ఊరుకోం

- పలు పేర్లతో తూనికల్లో ఎక్కువ తీసుకోవడం అన్యాయం
- దీనిపై జిసిసి ఎమ్‌డి సమాధానం చెప్పాలి
- గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు: కన్నతల్లే పిల్లలకు కడుపుకోత విధిస్తే వారు ఎవరికి చెప్పుకోవాలో తెలియనట్టే... జిసిసి వల్ల గిరిజన రైతుల పరిస్థితి కూడా అలా ఉందని జికె.వీధి మండలం గాలికొండ ఎంపీటీసీ అంపురంగ బుజ్జిబాబు అన్నారు. గిరిజన రైతులకు జిసిసి అన్యాయం చేస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిసిసి ప్రభుత్వ సంస్థ కావడం, ఈ ఏడాది ముందస్తుగా కాఫీ గింజలు కేజీకి రూ.135 ప్రకటించడంతో గిరిజన రైతులు జిసిసికే కాఫీ పిక్కలు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. కాని జిసిసి ఒక ప్రైవేట్ దళారీ సంస్థల వ్యవహరిస్తూ 30 కేజీలు బస్తాకు గోనుక కేజీ, తేమకు కేజీ, తరుగు పేరుతో 300 గ్రాములు అదనంగా తూనికల్లో తీసుకోవడం అన్యాయమన్నారు. ఇలా అయితే రైతులకు ఎలా మేలు జరుగుతుందని ప్రశ్నించారు. ఈ పరిస్థితి ఏజెన్సీ 11 మండలంలో ఉందా? లేకుంటే ఒక్క గూడెంకొత్త వీధి మండలంలోనే ఉందా? అని రైతులు ప్రశ్నిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని జిసిసి డిఎం, మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లామని, అయినా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే పైఅధికారుల నుంచి కింద స్థాయి అధికారుల వరకు ఒకే ఆలోచనతో ఉండి ఇలా గిరిజనులను దోపిడీ చేస్తున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. కాఫీ కొనుగోలుపై గిరిజన రైతులకు జిసిసి ఎమ్‌డి తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. గిరి రైతుల పండించిన కాఫీ పిక్కలకు జిసిసి నిర్ణయించిన రేటు ప్రకారమే తీసుకోవాలే తప్ప అదనంగా తరుగు పేరుతో తూనికలులో ఎక్కువ తీసుకుంటే సహించేది లేదని బుజ్జిబాబు హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంపై గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బంధవీధి ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న కోర్ర కవిత (11) గత కొద్ది రోజులుగా బంధవీధి ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో ఆమె ఇంటికి స్వయంగా వచ్చేసింది. ఈనెల 17 న మధ్యాహ్నం ఒంటిగంటకు కవిత తన స్వగ్రామం మైన అరగడపల్లిలో మృతి చెందింది. ఈ నేపథ్యంలో గిరిజన సంఘ నాయకులు సాగిన ధర్మన్న పడాల్, కూడా రాధాకృష్ణ విద్యార్థి స్వగ్రామమైన అరగడపల్లి గ్రామానికి చేరుకొని విద్యార్థి మృతికి గల కారణాలు తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, బాలిక మృతికి అధికారులు, స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమన్నారు. కవితకు ఆరోగ్యం బాగోలేదని తెలుసుకొని తండ్రి పాఠశాలకు వెళ్లినప్పుడు తనతో కుమార్తెకు పంపించండి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తానని చెప్పినా పాఠశాల సిబ్బంది పంపించ లేదన్నారు. స్కూల్ యాజమాన్యం కూడా వైద్యం అందించ పోవడంతో ఈనెల 9న కవిత తన ఊరు వరకు నడుచుకుంటు వచ్చిందని, కనీసం అటెండర్ కూడా ఇవ్వకుండా ఇంటికి పంపించినట్లు వాపోయారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి, బాధ్యులైన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు హెల్త్ అసిస్టెంట్‌ను నియమించాలన్నారు. హాస్టల్స్‌లో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించేందుకు ప్రజాసంఘాలు, మీడియాకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆశ్రమాల్లో అనుమతి ఇవ్వకపోవడంతోనే ఏమి జరుగుతుందో బయట తెలియకపోవడంతో విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కో కన్వీనర్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాగన ధర్మానపడాల్, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్, గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు పాంగి జీవన్ కృష్ణ, మహిళా సంఘం నాయకురాలు అరగడ శ్రీలత పాల్గొన్నారు.



రోధిస్తున్న బంధువులు



ఆందోళన చేపడుతున్న నాయకులు

టిడిపి నేతల ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తూర్పుగోదావరి జిల్లా అనపర్తి వద్ద టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వారంతా చేరుకుని ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వ లేకనే వైసిపి ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవాలని యత్నిస్తోందని విమర్శించారు. వైసిపి ప్రజావ్యతిరేక, నిరంకుశ పాలనపై విసిగిపోయిన ఓటర్లు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎపిలో వైసిపి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని, నియంత పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్పే రోజు దగ్గర పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సింహాచలం, బి.జ్యోతికిరణ్, బి.జగదీష్, డి.విశ్వనాథం, కె.శివశంకర్, డి.వెంకటరమణ, కె.కోటిబాబు, శ్రీను, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గడ్డి ఈశ్వరి,



పట్టుబడిన బియ్యం

అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలం నుండి పెద్దాపురం ప్రాంతానికి మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని శనివారం స్థానిక తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచార్యులు ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని సీజ్ చేశారు. తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారి తెలిపిన వివరాలు ప్రకారం... మండలం నుండి సుమారు నాలుగు టన్నులు బియ్యాన్ని పీడీఎస్ లబ్ధిదారుల నుండి సేకరించి పెద్దాపురం ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మండలంలోని ఏవనక రాయి గ్రామం వద్ద తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. వాహనంలో బియ్యం తరలిస్తున్న పెద్దాపురం మండలం గోరంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. వాహనాన్ని జడ్డంగి పోలీస్ స్టేషన్‌కు తరలించి, విచారణ చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏ సత్యనారాయణ, జడ్డంగి విఆర్ఓ ఎస్ నానాజీ పాల్గొన్నారు.

చిత్రకొండలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు: కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీకి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్ర ఒడిశా చుట్టుపక్కల గిరిజనులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీకి సంఘీభావం తెలిపారు. థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు కాంగ్రెస్ నాయకులు ఒడిశా రాష్ట్రం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఒడిశా కోరాపుట్ జిల్లా కాంగ్రెస్ నేత శరత్ చంద్ర బుర్జ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఒడిశాలో అభివృద్ధి బాటలో నడిపిస్తుందని, ప్రతి ఒక్కరూ రాహుల్ గాంధీ చేస్తున్న యాత్రకు మద్దతు తెలియజేయాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ బినత్ కిలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వలనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావటానికి కాంగ్రెసు కార్యకర్తలు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర తరపున మాజీ సర్పంచ్ అల్లంకి రాజు, కార్యకర్తలు సొన్ను, ఒడిశా నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న నాయకులు

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

పలు చోట్ల అన్న సమారాధనలు



పాడేరు శివాలయం వద్ద భక్తులు..

మహా శివరాత్రి వేడుకలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో శివాలయాలు కిటకిటలాడాయి. శివరాత్రి సందర్భంగా పలు ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-పాడేరు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పాడేరులో ఉమా నీల కంఠేశ్వర స్వామి ఆలయం భక్తులతో నిండిపోయింది. ఆలయం వద్ద మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. వేలాది మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఉమానీల కంఠేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మహాన్యాస రుద్రాభిషేక పూజలలో పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఆలయ కమిటీ సభ్యులు ఉమానీల కంఠేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్ళి సింహాచలం నాయుడు, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్ళి ఉషారాణి, ఆధ్యాత్మిక సేవా బృందం ప్రధాన కార్యదర్శులు ఉప్పల వెంకటరత్నం, శివరాత్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కొట్టగుళ్ళి రామారావు, కొట్టగుళ్ళి రమేష్ నాయుడు, కొట్టగుళ్ళి పోతురాజు, సంయుక్త కార్యదర్శులు పలాసి బాలన్న, సిద్ధరాతి కొండలరావు పాల్గొన్నారు.



రాజవొమ్మంగి మండలం జడ్డంగి శివాలయం వద్ద...

బొర్రా గుహల్లో తిలకించిన భక్తులు

అనంతగిరి: మండలంలో బొర్రా గుహలు, లొంగపర్తి, శంకుపర్తి ప్రాంతాలలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ప్రముఖ పర్యాటన కేంద్రమైన బొర్రా గుహల్లో భక్తుల సౌకర్యార్థం పర్యాటకశాఖ ఉచిత ప్రవేశం కల్పించారు. సర్పంచ్ జన్ని అప్పారావు ఆధ్వర్యంలో పలు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. బొర్రా గుహలలో శివాలయాన్ని చత్తీష్ ఘడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వేలాధి మంది భక్తులు దర్శించుకున్నారు. లుంగపర్తి, శంకుపర్తే గ్రామాలలో శివాలయాలకు భక్తులు తరలి వెళ్లారు.

జి.మాడుగుల: మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారి జాము నుంచే శివాలయాలన్నీ కిటకిటలాడాయి. పలుచోట్ల భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద అన్న సమరాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ డిఎస్‌పి కెసి రాజా, ఇన్స్పెక్టర్ ఝాన్సీరామ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

రాజవొమ్మంగి : మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, వాతంగి, లబ్బర్తి, కుంతిదేవి వాక, అమ్మిరేకుల తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజవొమ్మంగి, జడ్డంగిలో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ కమిటీలు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. వేలాదిమందికి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాజవొమ్మంది సీఐ ఎస్‌కె బాజీలాల్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు, ఆలయాల వద్ద ఏర్పాట్లను రాజవొమ్మంగి తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, ఎంపీడీవో కె బాపన్నదొర పర్యవేక్షించారు.



సీలేరు శివాలయంలో క్యూ కట్టిన భక్తులు

కొయ్యూరు : మండలంలోని కొయ్యూరు, గాదిగుమ్మి, చింతలపూడి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద ఆలయ కమిటీలు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. కొన్ని ఆలయాల వద్ద అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కొయ్యూరు సీఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు, మంప ఎస్ఐలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీలేరు : మహాశివరాత్రి వేడుకలు జికె.వీధి మండలం సీలేరులో అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక శివాలయంలో పంచామృతాలతో శివలింగానికి అభిషేకాలు పూజా నిర్వహించారు. భక్తులు సీలేరు నదిలో స్నానాల ఆచరించి శివాలయంలో పూజలు చేశారు. అలాగే జీకే వీధి మండలం దారకొండ శివాలయంలోనూ శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల నుండి గిరిజనులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

రంపచోడవరం : మండలంలోని రంప గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు రంపచోడవరం భాను సప్లై అధినేత బత్తిన శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా తాగునీరు, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య శిబిరం, జీసీసీ ద్వారా పూజా సామాగ్రి, ఏపిఈపిడిసిఎల్ ద్వారా కరెంటు, పంచాయతీశాఖ ద్వారా శానిటేషన్, పోలీసు శాఖ ద్వారా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ జాన్ విల్టన్, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, సీఐ రవికుమార్, డాక్టర్ సుజిత, డిఇలు అల్లాడి వెంకటేశ్వరరావు. రాజేంద్ర బాబు, శ్రీనివాసరావు, ఎస్ఐ మోహన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రంపచోడవరం డీఎఫ్ఓ నరేంద్రన్ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు.

చింతూరు : మండలంలోని చట్టి పంచాయతీ వీరాపురం గ్రామంలో గాద రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ ఆలయంలో ఉదయం నుండి డిఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. భద్రాచలం పట్టణానికి చెందిన పసుపులేటి రామకృష్ణ, ఎడ్లపల్లి రామారావు, రెడ్డి సతీష్ కుమార్ సుమారు 5000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి ఆనుకొని ఉన్న గాదె లింగేశ్వర స్వామి మహాలింగం దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివాసీలు శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి భద్రతా ఏర్పాట్లు చేశారు.



భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్న ఎపిటిఆర్ఎ సభ్యులు

ఎపిటిఆర్ఎ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట

మహాశివరాత్రి వేడుకను పురస్కరించుకుని ఎపి గిరిజన విలేకరుల సంఘం (ఎపిటిఆర్ఎ) ఆధ్వర్యంలో శనివారం వెయ్యి మంది భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. అల్లూరి జిల్లా హుకుంపేట మండలంలోని మత్స్యగుండం, అడ్డుమండలో ప్రతి సంవత్సరం జరిగే మహాశివరాత్రి వేడుకలకు పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. ఎపిటిఆర్ఎ గత కొన్నేళ్లుగా ఈ వేడుకలకు విచ్చేసిన భక్తులకు పులిహోర, ప్రసాదం, మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేస్తుంది. ఎపిటిఆర్ఎ ఏర్పడిన నాటి నుండి ఆ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహాశివరాత్రికి వచ్చే భక్తులకు పులిహోర పంపిణీ చేపట్టారు. ప్రతి ఏటా జరిగే మహాశివరాత్రి వేడుకల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఎపిటిఆర్ఎను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఆర్ఎ సభ్యులు పి.దేముడుబాబు, సిహెచ్. రమణ, సూర్యారావు, దుర్గా, సునీల్, రాజారావు, జోషి, మహేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



బొర్రా గుహలు సందర్శనకు వచ్చిన భక్తులు



కొయ్యూరులో అన్న సమారాధన



రంపలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ..



వీరాపురం గాద రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద...



విశాఖపట్నం- కోరాపుట్ సెక్షన్‌లో తనిఖీ చేస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

కొరాపుట్ రైల్వే లైన్‌లో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం-కోరాపుట్ సెక్షన్‌ను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి శనివారం తనిఖీ చేశారు. వివిధ స్టేషన్లలో ఏర్పాటుచేసిన సౌకర్యాలు, ఆ విభాగంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. కేటరింగ్ యూనిట్లు, వెయిటింగ్ హాళ్లు, ఇతర సౌకర్యాలను కూడా పరిశీలించారు. శివలింగపురం, అరకు, సుక్కు, కోరాపుట్ స్టేషన్లలోని రైల్వే కార్యాలయాలు, ముఖ్యమైన స్టేషన్లలో భద్రతా అంశాలనూ పరిశీలించారు. ఈ మార్గంలో తరుచు రైళ్ల పట్టాలు తప్పడానికి గల కారణాలను అధ్యయనం చేసేందుకు అధికారులతో కలిసి సుక్కు-కోరాపుట్ మధ్య పట్టాలు తప్పిన సిట్‌ను కూడా పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్లాట్‌ఫారమ్, స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించి ప్రయాణికులతో సంభాషించారు సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) పికె మహారాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ఎస్‌కె పాత్ర అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'వైసిపి పాలనలో దళితులు, మైనారిటీలపై దాడులు'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగన్మోహన్‌రెడ్డి పాలనలో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్ ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళిత నాయకుడు, మాజీ మంత్రి జవహర్‌ను పోలీస్ స్టేషన్‌లో కింద కూర్చోబెట్టి పోలీసులు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తిలో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అడ్డుకున్నారని ప్రశ్నిస్తే మాజీ మంత్రి జవహర్, ఇతర దళిత నేతలతో అమర్యాదగా ప్రవర్తించి పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో దళితులు, మైనారిటీ తరగతులపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో దళితులు, మైనారిటీలు ప్రభుత్వ వైఖరి గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

'ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : తొట్లకొండలో బౌద్ధేతర గుడి నిర్మాణ ఘటనను పక్కదారి పట్టించిన ఆర్కియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావును సస్పెండ్ చేయాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ, ఇతర సంఘాలు డిమాండ్ చేశాయి. అంబేద్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బుద్ధిష్ట మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణ, కో కన్వీనర్ ఎం.మల్లయ్య రాజు మాట్లాడారు. చారిత్రక బౌద్ధ క్షేత్రం తొట్లకొండలో బౌద్ధేతర గుడి నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని తెలిపారు. దీనిపై బౌద్ధ, దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ గుడిని తొలగించారు కానీ అలాంటి నిర్మాణం ఏమీ జరగలేదంటూ ఆర్కియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావు అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. తొట్ల కొండపై భౌద్దేతర గుడి నిర్మించారనే ఆధారం ఉన్నప్పటికీ వాటిని మాయం చేసే ప్రయత్నానికి ఆయనే కారణమని ఆరోపించారు. అయినప్పటికీ ఆధారాలు చూపించగలమని చెప్పారు. అక్కడ వాచ్ మ్యాన్‌గా పనిచేస్తున్న చిన్నారావు ఈ గుడిని నిర్మించాడని, సంఘాలు అభ్యంతరం తెలియజేయటంతో అతన్ని విధుల నుంచి తొలగించారని తెలిపారు. కానీ అతనిపై ఎలాంటి కేసూ నమోదు చేయలేదని పేర్కొన్నారు. చారిత్రక బౌద్ధ క్షేత్రాలలో భౌద్దేతర గుడిని నిర్మించడం మాన్యుమెంట్స్ చట్టానికి వ్యతిరేకమన్నారు. ఈ గుడి నిర్మాణం బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చిందని గురువారం పరిశీలనకు వెళ్లామని తెలిపారు. ముందు రావద్దంటూ అడ్డుకున్నారని, చివరకు అనుమతితో అక్కడికి వెళ్లేసరికి గుడిని తొలగించారని చెప్పారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించండి



అజీమాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అనిత, రాంబాబు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం :

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గాజువాక జోన్, 66వ వార్డు అజీమాబాదులో శనివారం ప్రజాసంఘాల నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, ముద్రించిన కరపత్రాలను అందించి, రమాప్రభకు ప్రధమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేత ఎస్.అనిత, ఐద్వా అధ్యక్షులు కామేశ్వరి, కార్యదర్శి జి.లక్ష్మి, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎం విజయరావు, ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : 250 ప్రజా సంఘాలు బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.రామ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి ఎం.వెంకట అప్పారావు, సెజ్ నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బుద్ధ రంగారావు తదితరులతో కలిసి శనివారం పట్టభద్రులను కలిశారు. పట్టభదల ఓట్లను రమాప్రభకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా సంఘాలు యువకులు విద్యావంతులు ప్రతి ఒక్కరు రమాప్రభ గెలుపునకు కృషి చేసి సహకరించాలని కోరారు.



అచ్యుతాపురం మండలం హరిపాలెంలో ప్రచారం...

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ దేశానికి నష్టం



దీక్షలో కూర్చున్న ఆవాజ్ కమిటీ సభ్యులకు మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడం వల్ల ఉపాధిలేమితో పాటు, దేశానికి తీవ్ర నష్టం కలుగుతుందని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 688వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో విశాఖ జిల్లా ఆవాజ్ కమిటీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. శిబిరాన్ని రమాప్రభ సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల దేశానికి, రాష్ట్రానికి, స్థానిక సంస్థలకు గణనీయంగా ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు అమలు జరిగి అన్ని తరగతుల వారికి ఉపాధి లభిస్తుందన్నారు. గత 50 ఏళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో చక్కగా నడుస్తూ, లాభాలను సాధించిందన్నారు. కార్మికుల శ్రమతో కర్మాగారం విస్తరించబడిందని తెలిపారు. నష్టాలు వస్తున్నాయని చెప్పి ఈ కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయడం భావ్యం కాదన్నారు. దీనికి అవసరమైన సొంత గనులను సమకూర్చాలని, బొగ్గు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, బ్యాంకుల నుంచి ఆర్థిక తోడ్పాటు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతున్న స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడటానికి తాను కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా ఆవాజ్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ఆయుబ్, కార్యదర్శి అబ్దుల్ అసరఫ్, జహరా ఆరా, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు అబిదా, అబ్దుల్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

'జన్మభూమి'కి ఆధునిక ఎల్‌హెచ్‌బి రేక్ కోచ్‌లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి, ఆధునిక లింకే హాఫ్మాన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) రేక్‌ను విశాఖపట్నం-లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ అందించనుంది. 12805 విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23 నుంచి, 12806 లింగంపల్లి-విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24 నుంచి ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో నడుస్తాయి. దీంతో విశాఖపట్నం నుంచి బయలుదేరే 20 జతల రైళ్లను ఎల్‌హెచ్‌బిగా మార్చడం జరిగింది.



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న కృష్ణకుమారి తదితరులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: టెన్త్ విద్యార్థులు ఇష్టపడి విద్యనభ్యసిస్తే శతశాతం ఉత్తీర్ణులై పాఠశాల అధ్యాపకుల, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి సూచించారు. మండలంలోని శనివారం కురిడి రైల్వే గేట్ సమీపంలో ప్రత్యూష హోమ్ అనాధ శరణాలయ పాఠశాలతో పాటు డుంబ్రిగుడ కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఆమె 10వ తరగతి విద్యార్థినులకు పరీక్షల సమయాల్లో తీసుకోవాల్సిన మెలకువలపై సలహా సూచనలను అందించారు. అనంతరం విద్యార్థినులకు అట్టలు, పెన్నులు, పెన్సిల్ లను పంపిణీ చేశారు. పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులవ్వాలన్నారు. ఉపాధ్యాయులు నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రెసిడెంట్ పెనుమాల ధర్మ, వైస్ ప్రెసిడెంట్ కె.నగేష్, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ప్రసాద్

సచివాలయ ఉద్యోగికి ఉత్తమ అవార్డు


ప్రజాశక్తి-కొయ్యూరు : బంగారమ్మపేట-1 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఆధార్ సూపర్వైజర్ కె.ప్రసాద్‌కు ఉత్తమ అవార్డు లభించింది. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆయనకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒకటవ ర్యాంకు, అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. గ్రామ, వార్డు సచివాలయ అడిషనల్ కమిషనర్, గ్రామ సచివాలయ డైరెక్టర్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నగర సుందరీకరణ పనులు పూర్తికి ఆదేశం

ప్రజాశక్తి-విశాఖపట్నం : నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ అనంత శంకర్‌తో కలసి జోడుగుళ్లపాలెం నుంచి రాడిసన్ హోటల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జి - 20 సదస్సుకు దేశ విదేశాల నుంచి దాదాపు 200 మంది అతిథులు వస్తున్నారని వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

ఢిల్లీ బృందం స్టడీ టూర్

ప్రభుత్వ డైట్, కస్తూర్బాల సందర్శన



భీమిలి డైట్‌లో ఢిల్లీ బృందంతో ఆర్‌జెడి, డిఇఒ తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఢిల్లీ సభ్యుల బృందం స్టడీ టూర్‌లో భాగంగా, శనివారం స్థానిక ప్రభుత్వ డైట్, కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. ఢిల్లీ ఎస్‌సిఇఆర్‌టి ప్రిన్సిపల్ శ్రీరామ్ కిషోర్, రును చౌదరి, వైస్ ప్రిన్సిపల్ సునీత మిట్టల్ నేతృత్వంలోని బృందానికి ఎపిలో అమలవుతున్న విద్యావిధానాన్ని పిపిటి ద్వారా డైట్ ప్రిన్సిపల్ యు మాణిక్యంనాయుడు వివరించారు. పరస్పర స్టడీ టూర్లతో పాఠశాల నిర్వహణ, బోధనాసామర్థ్యం మెరుగుకు దోహదపడతాయని విద్యాశాఖ ఎం.జ్యోతి కుమారి అన్నారు. డైట్‌లో విద్యావిధానం, శిక్షణ తరగతులు, ఇతర కార్యక్రమాలపై ఢిల్లీ బృందానికి డైట్ అధ్యాపకులు వివరించారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో అమలవుతున్న దేశభక్తి, హ్యాపీ కరికులం గురించి స్థానిక అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఆతిథ్య బృందం వివరించింది. కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఎపిసి బి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ ఎ.గౌరీశంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ బృందంలోని సభ్యులను డైట్, కెజిబివిల్లో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

యువతకు సీనియర్ క్రికెటర్లు ఆదర్శం

ప్రజాశక్తి-గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సీనియర్ క్రికెట్ కోచ్ కృష్ణారావు (గాంధీ) జన్మదిన వేడుకలు శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజువాక సీనియర్ క్రికెటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఎంతో మంది యువతకు క్రికెట్‌లో శిక్షణనిచ్చి, వారిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో కోచ్ కృష్ణారావు పాత్ర ఎనలేనిదన్నారు. 40ఏళ్ల వయస్సులోనూ క్రికెట్ ఆడుతూ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గాజువాక సీనియర్స్ క్రికెటర్స్ నేటి యువతకు ఆదర్శమని ప్రశంసలు కురిపించారు. సీనియర్ క్రికెటర్స్.ఆర్గనైజింగ్‌సెక్రటరీ కసిరెడ్డి నూకరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నేత కసిరెడ్డి సత్యన్నారాయణ, ఇడిసిఎ జాయింట్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీను, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర మాజీ మంత్రి వెంకటేశ్వరరావు దంపతులు, లీగల్ మెట్రాలజీ అండ్ రోడ్ సేఫ్టీ డిజి కెఆర్ఎం కిషోర్‌కుమార్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు, ఇఇ శ్రీనివాసరాజులు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండప ప్రదక్షిణ, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా అధికారులు స్వామి ప్రసాదాన్ని అందించారు.

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుందాం

- 41వ వ్యవస్థాపక దినోత్సవంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ
- నిర్వాసిత నిరుద్యోగుల నిరసన దీక్ష



నివాళులర్పిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని చేస్తున్న పోరాటానికి అందరి మద్దతు లభిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ 41వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉక్కునగరం కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉక్కు మృతువీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా కార్మికులంతా ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు. అఖిలపక్ష పోరాట కమిటీ వేసి కార్యాచరణ రూపొందించి వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వద్దకు వెళ్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిని చూపించి, ప్రభుత్వ రంగంలో కొనసాగేలా ఢిల్లీలోని అన్ని పార్టీలను కలిసి మద్దతు కోరనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, రామకృష్ణ, కె ఎస్ ఎన్,మస్తానప్ప పాల్గొన్నారు.



కొవ్వొత్తుల జంక్షన్ వద్ద దీక్ష చేపడుతున్న నిర్వాసిత నిరుద్యోగులు

నిర్వాసిత నిరుద్యోగులు నిరసన దీక్ష

32 త్యాగధనుల సమాధులపై నిర్మించిన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని నిర్వాసిత నిరుద్యోగులు అన్నారు. స్టీల్ ప్లాంట్ 41 వ వ్యవస్థాపక సందర్భంగా ఉక్కునగరం కొవ్వొత్తుల జంక్షన్ వద్ద నిరసన దీక్ష చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఎనిమిది వేల పైచిలుకు నిర్వాసితులకు న్యాయం చేయకుండా ఎలా ప్రైవేటీకరణ చేస్తారని ప్రశ్నించారు. ప్రాణ త్యాగాలు చేసైనా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని దీక్ష పూనారు. కార్యక్రమంలో ఉమ్మడి అప్పారావు, భాస్కరరావు, అధిక సంఖ్యలో నిర్వాసిత నిరుద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలపై ధన ప్రలోభం

పంజాబ్ వర్సిటీ విశ్రాంత ఎకనమిక్స్ ప్రొఫెసర్ బల్వీందర్‌సింగ్ తివానా

గీతంలో ముగిసిన ఐపిఇఎ 26వ వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి- మధురవాడ : ప్రజాస్వామ్యంలోని వ్యవస్థల న్నింటినీ నిర్వీర్యం చేసేలా ధన వినియోగం కీలక పాత్ర వహిస్తుండటం విచారకరమని పంజాబ్ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ బల్వీందర్ సింగ్ తివానా ఆవేదన వ్యక్తం చేశారు.. ఎపి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ సంయుక్తం ఆధ్వర్యాన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇండియన్ పొలిటికల్ ఎకానమీ అసోసియేషన్ (ఐపిఇఎ) 26వ వార్షిక సమావేశాలు శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ బల్వీందర్‌సింగ్ మాట్లాడుతూ, అధికారం కోసం కార్పొరేట్ సంస్థల నిధులతో చట్టసభల సభ్యులను కొనుగోలు చేయడం బాధాకరమన్నారు. దేశంలో రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు కలిసి నడుస్తున్న తీరును ప్రజలు అర్థం చేసుకొని, వాటి పర్యవసానాలను గమనించాలన్నారు. పంజాబ్‌లో రైతులు, మేథావులు, వివిధ వర్గాల ప్రజలతో నడిచిన రైతు ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ ప్రజల భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలని ప్రభుత్వాలను కోరారు. ఐపిఇఎలో తీర్మానాలను వెల్లడించారు.

ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ గాలిబ్ మాట్లాడుతూ సమాజ హితానికి, ప్రణాళికల రూపకల్పనకు దోహదపడేలా రాజకీయ ఆర్థిక శాస్త్రంపై పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) ఆర్థిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ కె.కల్యాణ్ మాట్లాడుతూ, ఆర్థిక, రాజనీతి శాస్త్రాల సమ్మిళిత ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం డీన్ ప్రొఫెసర్ ఆర్‌వి.రమణమూర్తి, సమావేశాల కన్వీనర్ డాక్టర్ ధనుంజయకుమార్, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.నళిని పాల్గొన్నారు.



ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మొకర నారాయణరావు జ్ఞాపకార్థం భీమిలిలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు విశ్రాంత ప్రిన్సిపాల్ కెఎస్ఆర్ కృష్ణారావు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, చరిత్ర, ప్రభుత్వ పాలనాశాస్త్రం, సామాజిక శాస్త్రం, తెలుగు, హిందీ సాహిత్యం తదితర సబ్జెక్టుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 89856 47419 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు



ఖోఖో అడుతున్న బాలికలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతున్నాయి. అండర్-14 బాలురు, బాలికల విభాగంలో వివిధజిల్లాలకు చెందిన జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. శనివారం జరిగిన పోటీల ఫలితాలు, విజేతలను ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ వెంకటరెడ్డి తెలియజేశారు. బాలుర విభాగంలో విజయనగరం జట్లు నెల్లూరుపై 7-19 పాయింట్ల తేడాతోనూ, గుంటూరు జట్టు, పశ్చిమగోదావరిపై 14-13పాయింట్ల తేడాతో, అనంతపూర్ జట్టుపై చిత్తూరు జట్లు 12-10 పాయింట్ల తేడాతో, ప్రకాశం జట్లుపై కర్నూల్ జట్లు 11-6 పాయింట్ల తేడాతో, నెల్లూరుపై శ్రీకాకుళం బాలుర జట్టు 1-0 తేడాతో, కడపపై చిత్తూరు బాలుర జట్టు 19-11తేడాతో విజయం సాధించాయి. ఇక బాలికల విభాగంలో కృష్ణా జిల్లాజట్టుపై అనంతపూర్ జట్టు9 పాయింట్ల తేడాతోనూ, కడప జట్టుపై విజయనగరం జట్టు 11 పాయింట్ల తేడాతోనూ, నెల్లూరు జట్టుపై విశాఖ జట్లు 14-5 పాయింట్లతోనూ, నెల్లూరుపై కడప బాలికల జట్టు 2 పాయింట్ల తేడాతో, పశ్చిమ గోదావరి జట్టుపై చిత్తూరు జట్లు 12-11 పాయింట్ల తేడాతో, ప్రకాశం జట్టుపై తూర్పు గోదావరి జట్టు 8-7 పాయింట్ల తేడాతో, విజయనగరం జట్టుపై విశాఖ బాలికల జట్టు 6-4 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. కష్ణాపై గుంటూరు జట్టు 14-12 పాయింట్ల తేడాతో, ప్రకాశంపై విశాఖ జట్టు 17-6 తేడాతో, పశ్చిమ గోదావరిపై కష్ణా జట్టు 12-10 తేడాతో విజయం సాధించాయి.

మోడీ విధానాలు అప్రజాస్వామికం

ప్రజాశక్తి -గాజువాక: కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ చర్యలు అప్రజాస్వామికమని సిపిఐ నేతలు మండిపడ్డారు. శనివారం 72వ వార్డు చైతన్యనగర్‌లో జి.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన శాఖా సమావేశంలో పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె స్టాలిన్ మాట్లాడుతూ. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజల సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులుకు కారుచౌకగా కట్టబెట్టడంతోపాటు బోగస్ కంపెనీలను తెరపైకి తీసుకొచ్చి ప్రజాధనం లూటీ చేసేలా ప్రోత్సాహించడం దుర్మార్గమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన ఎనిమిదేళ్లుగా ప్రజలు, కార్మికులు నానా కష్టాల పడుతున్నారని విమర్శించారు. బిజెపి ప్రజాకంటక పాలనను అడుగడుగునా సిపిఐ అడ్డుకుంటోందని, ప్రజా ఉద్యమాల ద్వారా కేంద్రానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ శాఖా కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి, నాయకులు పొనగంటి భాస్కర్, పెంటకోట నర్సింగరావు, ఎం.రామారావు, మహిళా నేతలు కెవి.కుమారి , అప్పారి శ్రీలక్ష్మి , పిల్లా సూర్యపద్మ పాల్గొన్నారు.